క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

జేఎన్‌టీయూ గురజాడ వీసీకి అభినందనలు



వీసీ ప్రొఫెసర్ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రజక వర్గీయులు

దాబాగార్డెన్స్: కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ వి.వి.సుబ్బారావు సోమవారం విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ వీసీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ చైర్మన్, రైల్వే కార్మిక నాయకుడు పొన్నాడ మోహనరావు నేతృత్వంలో రజకులతో ప్రొఫెసర్ సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పి.చెల్లారావు, జంప చిన్న, కోదాడ సత్యనారాయణ, గురజాపు సత్యారావు, పైడిరాజు, కొల్లేటి శ్రీను, పాతపట్నం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆర్పీల నిరసన



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్పీలు

మహారాణిపేట: జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలకు బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న 1,025 మంది ఆర్పీలకు పెండింగ్ జీతాలను చెల్లించాలని సంఘ గౌరవ అధ్యక్షురాలు పి.మణి కోరారు. జీవీఎంసీలో చేపట్టే ప్రతి పనిలో తాము ఎంతో కష్టపడుతున్నా.. సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.లక్ష్మి, సిహెచ్.ఝాన్సీ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాల్ట్రీని గ్రామానికి దూరంగా తరలించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వాలిమెరక గ్రామస్తులు

మహారాణిపేట: పౌల్ట్రీ వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, తక్షణం ఈ పరిశ్రమను గ్రామానికి దూరంగా తరలించాలని వాలిమెరక గ్రామ పంచాయతీ ప్రజలు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సియ్యదుల సాయివేని, 30 మంది ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పెందుర్తి మండలం వాలిమెరక పంచాయతీ దువ్వపాలెం పరిసరాలు, సౌభాగ్య రాయపురంలో సుమారు 15 ఏళ్ల నుంచి రమాదేవి పౌల్ట్రీస్ నడుపుతున్నారని, దాని వల్ల గ్రామస్తులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తక్షణమే ఈ పౌల్ట్రీస్ ప్రజలకు దూరంగా తరలించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 4.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పి.ఆర్.బిషోయిలు తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోనిపలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ అలీగడ్ జిల్లాకు చెందిన జగవీర్‌సింగ్ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేస్తుండటాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రూ.22,500 విలువైన 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

ప్రజలను బలిగొంటున్న నకిలీ మద్యం

సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించాలి

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్

నారా వారి నకిలీ మద్యంపై జగదాంబ జంక్షన్‌లో వినూత్న నిరసన

నకిలీ మద్యం తాగి భర్తలు చనిపోయారంటూ నడిరోడ్డుపై రోదించిన భార్యలు

నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



నకిలీ మద్యం కుటుంబాలను రోడ్డున పడేస్తోందంటూ మహిళ ఆవేదన

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మహిళల పసుపు కుంకుమలకు చెందిన విషయం కావడంతో వారికి అండగా నిలిచేలా సీబీఐ విచారణకు కేంద్రం ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ.. ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నేతల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వాసుపల్లి నేతృత్వంలో జగదాంబ జంక్షన్ వద్ద వినూత్న నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తాగి పలువురు భర్తలు మృతి చెందినట్టు.. ఆ కుటుంబాలు రోడ్డున పడినట్టు.. భార్యలు నడిరోడ్డుపై రోదిస్తూ తమను ఎవరు ఆదుకుంటారంటూ చేపట్టిన నిరసన పలువురిని ఆకట్టుకుంది. అనంతరం జగదాంబ జంక్షన్ వైఎస్సార్ విగ్రహం నుంచి లేపాక్షి జంక్షన్ మీదుగా టర్నర్ చౌల్ట్రీలోని తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు పార్టీ నాయకులు బొల్లవరపు జాన్‌వెస్లీ, సనపల రవీంద్రభరత్, కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్‌కుమార్ జైన్‌తో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి వాసుపల్లి వినతిపత్రం అందజేశారు. ర్యాలీ పొడవునా నకిలీ మద్యం, పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపులను వెంటనే అరికట్టాలని, మీ నకిలీ మద్యం దాహానికి ప్రజలు బలి.. అంటూ తదితర నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు.

కేసు నీరు గార్చేందుకే సిట్ ఏర్పాటు

ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల కనుసన్నల్లోనే రాష్ట్రంలో యథేచ్ఛగా నకిలీ మద్యం దందా సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల బట్టబయలైన నకిలీ మద్యం తయారీ, సరఫరా చూస్తే చాలా ఆందోళన కలుగుతోందన్నారు. నకిలీ మద్యంపై సిట్ దర్యాప్తు హాస్యాస్పదమన్నారు. కేసును నీరు గార్చేందుకే సిట్ ఏర్పాటని, తప్పు చేసిన వాళ్లే సిట్ వేస్తే ఎలా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే సీబీఐ దర్యాప్తు కోరాలన్నారు. నకిలీ మద్యంపై వాస్తవాలను వెలికి తీస్తున్నందుకే సాక్షి పత్రికపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నా.. డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కనిపించదని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లిక్కర్ పాలసీ పారదర్శకంగా అమలైందని, ప్రభుత్వమే స్వయంగా మద్యం దుకాణాలు నడిపి, దాదాపు మూడో వంతు షాపులను తగ్గించిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గత ప్రభుత్వ మద్యం విధానాలు రద్దు చేసిందని, వైన్ షాపులు పెంచడమే గాక, ప్రైవేట్‌కు అప్పగించారని, పర్మిట్ రూమ్‌లకు అనుమతించారన్నారు. అన్ని చోట్ల బెల్ట్ షాప్‌లు ఏర్పాటయ్యాయని, వేలంపాటలు నిర్వహించి వాటిని కేటాయించారని, కేవలం కూటమి పెద్దలు, ఆయా పార్టీల నేతల చేతుల్లోకి అవన్నీ వెళ్లిపోయాయన్నారు. టీడీపీకి చెందిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు గిరిధర్‌రెడ్డి, సురేంద్రనాయుడు, అనుచరుడు జనార్దన్‌రావులకు ఆఫ్రికాలో డిస్టిలరీలు ఉన్నట్టు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డి స్వయంగా గత ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారని, తద్వారా ఎన్నికల ముందే ఈ నకిలీ మద్యానికి బీజం పడినట్టు తెలుస్తోందన్నారు.

సీబీఐ దర్యాప్తు చేపట్టాలి

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్ట్ షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, దీని వెనుక ఎంత పెద్ద వారున్నా అరెస్టు చేయాలన్నారు. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని, నకిలీ, కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, నీలాపు లక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగదాంబ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ, పార్టీ మహిళా నేతలు, కార్పొరేటర్లు, నాయకులు



జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ వద్ద నకిలీ మద్యంపై పక్లార్డులు ప్రదర్శిస్తున్న మహిళా నేతలు



బ్యానర్‌పై సీఎం ఫొటో తీసేయాలని.. లేదంటే నిరసన చేయొద్దని పార్టీ నాయకులతో ఎస్ఐ వాగ్వాదం (చంద్రబాబు ఫొటోపై బ్లాక్ మార్క్ వేసిన తరువాత నాయకులు నిరసన చేపట్టారు.)

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నర్సులు

మహారాణిపేట: కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన పెంచడంతోపాటు శిక్షణ కార్యక్రమం సోమవారం కేజీహెచ్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరమన్నారు. తెలియని వారికి కూడా దీనిపై శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈనెల 16న బీచ్ రోడ్డులో సీపీఆర్ అవేర్‌నెస్ వాక్‌ను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ, గుండె నొప్పితో అపస్మారక స్థితిలో ఉన్నవారికి సీపీఆర్ చేయవచ్చునన్నారు. ఈ అవగాహన కార్యక్రమం నేటి నుంచి ఈనెల 17 వరకు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలక్ష్మి, ట్రామా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్, స్కిల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె. అపరంజి, స్కిల్ ల్యాబ్ కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు సీపీఆర్ ఉపయోగకరం

ఏయూ క్యాంపస్: గుండె ఆగినపుడు మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్త ప్రసరణ మెరుగుపరచడానికి, ప్రాణాలు రక్షించేందుకు కార్డియోపల్మనరీ రిసిటేషన్ (సీపీఆర్) ఉపయోగపడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాన్ని సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబులెన్స్‌లలో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్(ఏఈడీ) అవసరాన్ని వివరించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ సీపీఆర్‌పై పౌరులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా సీపీఆర్ శిక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఆర్ శిక్షకుడు రహమతుల్లా ప్రత్యక్షంగా తర్ఫీదు అందించారు. ప్రథమ చికిత్స ట్రైనర్ డాక్టర్ పి.రామారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ బాల సతీష్, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ పట్నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఫుట్ స్కానింగ్ ప్రారంభం



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి

మహారాణిపేట: ఫుట్ స్కానింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి అన్నారు. సోమవారం కేజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో ఏపీ మెడిటెక్ జోన్ సహకారంతో వైద్యులకు, పోస్ట్-గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, పాదంలో బరువు ఎలా సమతుల్యంగా ఉందో దీని ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సౌకర్యం ఇంతవరకు హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, కానీ నేటి నుంచి విశాఖలో కూడా ఈ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీ మెడిటెక్ జోన్ ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ ద్వారా ఈ అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం. చంద్రశేఖరం నాయుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. మన్మథరావు, పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీ.ఎస్. చక్రవర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, ఇతర విభాగాల వైద్యులు, పీజీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి వార్డు సమస్యలు



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. యూజీడీ, తాగునీటి సమస్య, గాజుల వీధిలో రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఉన్న 20 మంది హౌస్ కీపింగ్ వర్కర్లకు నాలుగు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కమిషనర్ స్పందించి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని భాస్కరరావు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం ఘటనలో అధికారులపై ఫిర్యాదు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ, దళిత, ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: పెందుర్తి మండలం చినముషిడివాడ అంబేడ్కర్ నగర్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన రెవెన్యూ సిబ్బంది, ఆదేశాలిచ్చిన ఆర్డీవో శ్రీలేఖ, తహసీల్దార్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజా దళిత మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ ఆ ప్రాంతంలో చాలా రోజులుగా అంబేడ్కర్ విగ్రహం ఉందని, అక్కడ ప్రభుత్వం బోరు కూడా ఏర్పాటు చేసిందన్నారు. అంబేడ్కర్ విగ్రహం, బోరు ఉన్న స్థలాన్ని వీఎంఆర్‌డీఏ అమ్మితే దానిని కొన్నారని, ఇప్పుడు కొత్తగా విగ్రహం పెట్టారని అవాస్తవాలతో చందక సాయికృష్ణ కోర్టులో పిటిషన్ వేశారన్నారు. దానిని పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు 2021లో కోర్టు డైరెక్షన్ ఇచ్చిందని చెప్పారు. ప్రస్తుతం ఇది కోర్టులో పెండింగ్‌లో ఉందని, విగ్రహం తొలగించమని ఆదేశాలు ఇచ్చినట్టు పిటిషన్ దారుడు సాయికృష్ణ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడన్నారు. ఆర్డీవో శ్రీలేఖ తమ డిపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ఫైల్‌ను కనీసం చూడకుండా పెందుర్తి తహసీల్దార్‌ను, సిబ్బందిని తన తప్పుడు ఆదేశాలతో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడానికి పురమాయించారని, దీనిపై తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఇందిర, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, భారత నాస్తిక సమాజం వై.నూకరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరావు, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం పూర్వ అధ్యక్షుడు కె.రవి, నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, కో కన్వీనర్ రూప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి నాయకులు బంకపల్లి అప్పారావు, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ యువ విభాగ అధ్యక్షురాలిగా లాస్య



దేవిశ్రీ లాస్యకు నియామక పత్రం అందజేస్తున్న డాక్టర్ వికాస్ పాండే

దాబాగార్డెన్స్: కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ విశాఖ జిల్లా యువ విభాగ అధ్యక్షురాలిగా దేవిశ్రీ లాస్య నియమితులయ్యారు. కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే సోమవారం తన కార్యాలయంలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ లాస్య నాయకత్వంలో కౌన్సిల్ మరింత బలపడతుందని అభిలషించారు. నిబద్ధత, అంకితభావంతో కౌన్సిల్ సేవలో కొనసాగి, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, యువతలో అవగాహన పెంపునకు కృషి చేస్తానని దేవిశ్రీ లాస్య అన్నారు.


సీజేఐపై దాడిని ఖండిస్తూ నల్లజెండాలతో నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాదిగ పోరాట సమితి నాయకులు

మహారాణిపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మాదిగ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అంజూరి దీపక్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కింతాడ రాజశేఖర్ మాదిగ పర్యవేక్షణలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దళితుల ఆత్మగౌరవం – రాజ్యాంగ రక్షణ కోసం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దీపక్ మాదిగ మాట్లాడుతూ సీజేఐపై దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణం కేసు నమోదు చేయాలన్నారు. రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ రాష్ట్ర రెల్లి సంఘం ఉపాధ్యక్షుడు పొడుగు కుమార్, నేషనల్ బాడీబిల్డింగ్ అధ్యక్షులు రాజారావు మాదిగ, కోరపల్లి నూకరాజు మాదిగ, బొడ్డు కిరణ్, పెట్లి ఈశ్వరరావు, రాజు, సిహెచ్.మంగ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను కొనసాగించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

బీచ్‌రోడ్డు: నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలను వెంటనే కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పేద ప్రజల వైద్యంపై చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించలేదనే నెపంతో ఈ నెల 10వ తేదీన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేయడంతో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయని మండిపడ్డారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, మన్మథరావు, క్షేత్రపాల్ రెడ్డి, పార్టీ జిల్లా సమితి సభ్యులు సీహెచ్. కాసుబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పుష్పలత, మత్స్య కార్మిక సంఘం నాయకులు కోడా వజ్రం, మీసాల శ్రీనివాస్, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య, అరిలోవ సీపీఐ పార్టీ శాఖ కార్యదర్శి లక్ష్మణరావు, అత్తిలి రవి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై వినతి



డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న ఏఐడీఎస్‌వో నాయకులు

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) విశాఖ నగర అధ్యక్షుడు కె.అభిలాష్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్‌వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న దారుణమైన పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, పరిశుభ్రమైన తాగునీరు లేకపోవడం, కనీస మరుగుదొడ్ల సౌకర్యం లేమి వంటివి విద్యార్థుల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. ఉపాధ్యక్షుడు బి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అనేక బీసీ హాస్టళ్లకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యంగా మాధవధార ఎస్టీ హాస్టల్‌లో ఏడాదిగా నీటి సమస్యను పట్టించుకోకపోవడం, కంచరపాలెం కప్పరాడ ఎస్టీ హాస్టల్‌లో టాయిలెట్లకు తలుపులు, నిరంతర నీటి సరఫరా లేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. విద్యార్థులు నష్టం చేస్తున్నారనే సాకుతో మరమ్మతులు నిలిపేయడం బాధ్యతారాహిత్యమని, సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీవీకే విద్యార్థులకు పతకాల పంట

సీతంపేట: విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యానికి అవసరమైన క్రీడలపై శ్రద్ధ చూపిస్తున్నామని బీవీకే విద్యా సంస్థల కార్యదర్శి వి.రామ సత్యనారాయణ తెలిపారు. భారతీయ విద్యా కేంద్రం 2025-26 సంవత్సరానికి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ క్షేత్ర, విద్యా భారతి రాష్ట్రీయ ఖేల్ కూద్‌లో వివిధ అంశాల్లో పతకాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ సోమవారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థల విద్యార్థులు స్కేటింగ్‌లో 1, బాక్సింగ్‌లో 12, అథ్లెటిక్స్‌లో 11, బాస్కెట్‌బాల్‌లో 24, బ్యాడ్మింటన్‌లో 5 మొత్తం 53 పతకాలు సాధించారని వెల్లడించారు. వీటిలో క్షేత్ర స్థాయిలో 12 బంగారు పతకాలు, 7 కాంస్య పతకాలు, 10 రజత పతకాలు, రాష్ట్ర స్థాయి ఖేల్ కూద్‌లో 7 బంగారు పతకాలు, 4 రజత పతకాలు ఉన్నాయన్నారు. ఈ పోటీల్లో క్షేత్ర స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ)లో పాల్గొంటారని తెలిపారు. బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించిన డి.అమృత, బి.భార్గవి, సిహెచ్.రవీంద్ర, జి.భానుప్రకాష్, ఆర్.భాస్కర్, ఎన్.రామచరణ్, ఎస్.జీవన్ చరణ్ తేజ్ ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను బీవీకే విద్యా సంస్థల డైరెక్టర్లు బుద్ధా లక్ష్మీనారాయణ(నాని), సుహాస్, బీవీకే కళాశాల ప్రిన్సిపాళ్లు పి.రత్నశేఖర్, రమా ఆచంట, ఈవో ఏవీఎస్ ఆచార్యులు, పీడీలు అభినందించారు.